www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 2 సంచిక -166 మంగళవారం 27 ఆగష్టు 2024 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -6 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,70306545



## 35 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తాం

హైదరాబాద్: నిరుద్యోగ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన 90 రోజుల్లోనే 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామన్నారు. మరో 35 వేల ఉద్యోగాలు త్వరలో భర్తీ చేయబోతున్నట్లు చెప్పారు.రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. సచివాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు రేవంత్ చెక్కులు అందజేశారు. ప్రిలిమ్స్ లో ఉత్తీర్ణత సాధించిన 135 మంది అభ్యర్థులకు ఒక్కొక్కరికీ రూ. లక్ష చొప్పున అందజేశారు.

**రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం చెక్కుల పంపిణీ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. రాష్ట్రం నుంచి అత్యధికంగా సివిల్ సర్వెంట్లు రావాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. సివిల్స్ ఉత్తీర్ణులై రాష్ట్ర ప్రతిష్ఠను పెంచాలని ఆకాంక్షించారు. మెయిన్స్లో ఉత్తీర్ణత సాధించి.. ఇంటర్వ్యూకి ఎంపికైన వారికి కూడా రూ.1 లక్ష ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించారు."చదువుకు తగిన నైపుణ్యాలు లేకపోవడంతో చాలా మంది ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో యంగ్ ఇండియా వర్సిటీ ద్వారా 2వేల మందికి శిక్షణ ఇస్తున్నాం. వచ్చే ఏడాది నుంచి 20 వేల మందికి శిక్షణ ఇస్తాం. అంతేకాకుండా యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తాం.

మిగతా 2లో.



2లో.

## డెంగీ జ్వరాల విజృంభణ

తెలంగాణలో వాతావరణ మార్పులు

ఇప్పటికే ఆరుగురు మృత్యువాత

## హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

రాష్ట్రంలో పెరుగుతున్న డెంగీ మరణాలపై కేటీఆర్ ఆవేదన

అసలు డెంగీ మరణాలు లేవని ప్రభుత్వం చెబుతోందన్న మాజీ మంత్రి

వార్తా పత్రికల్లో మాత్రం క్రమం తప్పకుండా కథనాలు అంటూ ట్వీట్

డేటాను ఎవరు, ఎందుకు దాచిపెడుతున్నారు..? అంటూ మండిపాటు



2లో.

## వక్ఫ్ బిల్లును వ్యతిరేకించిన తెలంగాణ వక్ఫ్ బోర్డు

కేంద్రం తెచ్చిన బిల్లు వక్ఫ్ సంస్థలను దెబ్బతీసేలా ఉందన్న బోర్డు

బిల్లు తిరస్కరణకు మద్దతు తెలిపిన సీఎంకు థ్యాంక్స్ చెప్పిన అసదుద్దీన్



హైదరాబాద్,ఆగస్టు 26,ప్రజావినికిడి:
వక్ఫ్ చట్ట సవరణ బిల్లును తెలంగాణ వక్ఫ్ బోర్డు వ్యతిరేకించింది. కేంద్ర ప్రభుత్వం సవరణ బిల్లును తీసుకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ బిల్లును పలువురు వ్యతిరేకిస్తున్నారు. సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు తెలంగాణ వక్ఫ్ బోర్డు వెల్లడించింది.చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ అధ్యక్షతన సోమవారం నాడు తెలంగాణ వక్ఫ్ బోర్డు సమావేశమైంది. ఈ సమావేశంలో మజ్లిస్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పాల్గొన్నారు.
కేంద్రం తీసుకువచ్చిన బిల్లు వక్ఫ్ సంస్థలను దెబ్బతీసేలా ఉందని బోర్డు అభిప్రాయపడింది. అందుకే ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొంది. ఈ బిల్లు తిరస్కరణకు మద్దతు ఇచ్చిన తెలంగాణ సీఎంకు హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ధన్యవాదాలు తెలిపారు.

## హైదరాబాద్‌లో మత్తు కలకలం!



2లో.

8.5 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం

కారు, మూడు సెల్‌ఫోన్లు సీజ్

ముగ్గురు నిందితుల అరెస్టు

## కోల్‌కతా వైద్యురాలి హత్యాచారం పాలీగ్రాఫ్ పరీక్షలో భిన్న కథనాలు

2లో.



## కొనసాగుతున్న హైడ్రా దూకుడు

రాయదుర్గంలో ఆక్రమణల కూల్చివేత

హైదరాబాద్,ఆగస్టు 26,ప్రజావినికిడి:
నగరంలో హైడ్రా కూల్చివేతలు ఆక్రమణదారుల గుండెల్లో దడ పుట్టిస్తున్నాయి. వరసగా కూల్చివేతలు చేస్తూ అక్రమార్కుల గుండెల్లో హైడ్రా నిద్రపోతోంది. పేద, ధనిక, సినిమా స్టార్లు, రాజకీయ నేతలు ఇలా ఎవరినీ వదిలిపెట్టకుండా కబ్జాలకు అడ్డుకట్ట వేస్తోంది

మిగతా 2లో.

## రేపు పీసీసీ సారథి ప్రకటన?

**పరిశీలనలో మహేశ్‌కుమార్‌గౌడ్, మధుయాస్కీగౌడ్, లక్ష్మణ్‌కుమార్, బలరాం నాయక్‌ల పేర్లు**

హైదరాబాద్ ఆగస్టు 26,ప్రజావినికిడి:
తెలంగాణ కాంగ్రెస్ నూతన అధ్యక్షుడి నియామకానికి ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది.కాంగ్రెస్ అధిష్ఠానం ఈనెల 28న కొత్త అధ్యక్షుడిని ప్రకటించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాస్కీగౌడ్, ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లతోపాటు మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. సామాజిక సమీకరణాల ఆధారంగా వీరిలో ఒకరిని అధ్యక్ష పదవికి ఎంపిక చేస్తారని తెలుస్తోంది. పీసీసీ అధ్యక్షుడిగా జులై 7వ తేదీతో రేవంత్‌రెడ్డి పదవీకాలం పూర్తయింది.నూతన అధ్యక్షుడిని నియమించాలని ఆయన ఇప్పటికే ఏఐసీసీకి తెలియజేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం సైతం అప్పటి నుంచి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపా దాస్‌మున్షీలను పలుమార్లు దిల్లీకి పిలిపించి, వారి అభిప్రాయాలను తీసుకుంది. తాజాగా గత వారం సైతం వారంతా దిల్లీకి వెళ్లి తమ అభిప్రాయాలను తెలియచేసి వచ్చారు. బుధవారం దశమి కావడంతో ఆ రోజు నూతన సారథిని ప్రకటించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది. మరోవైపు మధుయాస్కీగౌడ్ కొద్దిరోజులుగా దిల్లీలోనే మకాం వేసి, తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఎస్సీ వర్గీకరణపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఎస్సీ మాదిగకు అధ్యక్ష పదవి ఇస్తే ఎలా ఉంటుందనే ఆలోచనలో కూడా ఏఐసీసీ ఉన్నట్లు సమాచారం. ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ టికెట్ దక్కలేదని, ప్రస్తుతం పీసీసీ అధ్యక్ష పదవి ఇస్తే వారికి సముచిత ప్రాధాన్యం కల్పించినట్లు అవుతుందని ఆ వర్గం నేతలు పార్టీని కోరుతున్నారు.

## పేదలకు ప్రత్యామ్నాయం చూపాలి

హైడ్రా కూల్చివేతలపై

తెలంగాణ బీజేపీ కీలక నిర్ణయం

పెద్దల అక్రమ కూల్చివేతలు ఫర్వాలేదు కానీ , పేదల జోలికి వస్తే ఊరుకునేది లేదుబీజేపీ

అనుమతిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

2లో.

# డెంగీ జ్వరాల విజృంభణ

హైదరాబాద్,ఆగస్టు 26,ప్రజావినికిడి:

తెలంగాణలో వాతావరణ మార్పులతో వైరల్ ఫీవర్స్, డెంగీ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఆస్పత్రులకు రోగులు క్యూ కడుతున్నారు. వైరల్ ఫీవర్స్‌తో ఒకే రోజు ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగిస్తోంది. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం గంగాదేవిపాడు గ్రామంలో ఈడుపుగంటి సామ్రాజ్యం (67) అనే మహిళకు వారం కింద జ్వరం రావడంతో ఆస్పత్రిలో చేరారు. అక్కడి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. అటు, ఇదే మండలం బ్రహ్మళకుంటకు చెందిన బానోతు కృష్ణ (50)కు వారం కింద ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో కల్లూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. రెండు రోజుల కిందటే ఇంటికి వచ్చి పొలం వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రాణాలు కోల్పోయాడు. అలాగే, కామారెడ్డి – సదాశివనగర్ మండలంలోని భూంపల్లికి చెందిన మనస్విని (11)కి జ్వరం రాగా కుటుంబ సభ్యులు కామారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించాలని వైద్యులు సూచించారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ తీసుకొస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయింది. అటు, ఇదే కామారెడ్డి – సదాశివనగర్‌లో నరేశ్ (29) అనే వ్యక్తి డెంగీతో మృతి చెందాడు. అలాగే, కరీంనగర్ – ధర్మారం మండలం నందిమేడారం గ్రామానికి చెందిన నేరెళ్ల ప్రశాంత్ (26) జ్వరంతో ప్రాణాలు కోల్పోయాడు. ఇతను స్థానికంగా చికిత్స తీసుకున్నా తగ్గకపోవడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకున్నాడు. ఈ క్రమంలోనే తీవ్ర అస్వస్థతకు గురి కాగా కరీంనగర్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే చనిపోయాడు. మరోవైపు, మహబూబాబాద్ – కొత్తగూడ మండలం హనుమాన్ తండాలో రాజేందర్, సంధ్య దంపతులు హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ దంపతులు కుమార్తెకు 5 రోజుల కిందటే జ్వరం వచ్చి తగ్గింది. స్వగ్రామంలో పని ఉందని కూతురితో కలిసి వెళ్తుండగా.. దారిలో జ్వరం ఎక్కువై ఫిట్స్ వచ్చింది. ఈ క్రమంలోనే ఆమెను నర్సంపేటకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే చనిపోయినట్లు తల్లిదండ్రులు తెలిపారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వైరల్ ఫీవర్స్, డెంగీ జ్వరాలతో రోగులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ఇదే అదనుగా కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు ప్రతి జ్వరాన్ని డెంగీ అని చెప్పి చికిత్స కోసం భారీగా వసూలు చేస్తున్నాయి. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. 'డెంగీ ఉదయం పూట కుట్టే ఏడిస్ దోమల ద్వారా వ్యాపించే ఓ సాధారణ జ్వరం. ఇది కార్పో వైరస్ ద్వారా వ్యాప్తి చెందుతుంది. తీవ్ర జ్వరం, తలనొప్పి, కంటి లోపలి భాగం నొప్పి, వాంతులు, విరేచనాలు, కండరాలు, కీళ్లనొప్పులు, చర్మంపై దద్దుర్లు వంటి లక్షణాలు కన్పిస్తాయి. ప్లేట్ లెట్స్ సంఖ్య తగ్గుతుంది. అవి 20 వేలకు తగ్గినా ఇబ్బంది ఉండదు. తిరిగి అవే వృద్ధి చెందుతాయి. ప్రస్తుత సీజన్‌లో జ్వరాలతో ఎక్కువ మంది ఆస్పత్రులకు వస్తున్నారు. మరికొందరు నిర్లక్ష్యంతో సొంత వైద్యం చేసుకుంటున్నారు. అలా కాకుండా లక్షణాలు కన్పించిన వెంటనే

వైద్యున్ని సంప్రదిస్తే త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.' అని వైద్యాధికారులూ సూచించారు. మరోవైపు, రాష్ట్రంలో డెంగీ, విష జ్వరాల విజృంభణపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. 'రాష్ట్రంలో డెంగీ మరణాలు లేవని ప్రభుత్వం చెబుతోంది. కానీ ఒక్కరోజులో 5 మంది డెంగీతో చనిపోయినట్లు వార్తాకథనాలు పేర్కొంటున్నాయి. ఈ డేటాను ఎవరు ఎందుకు దాచిపెడు తున్నారని ట్విట్టర్ వేదికగా కేటీఆర్ ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరిపడా మందులు లేవని.. చాలా ఆస్పత్రుల్లో ఒక్కో బెడ్‌పై ముగ్గురు, నలుగురు ఉండి ట్రీట్మెంట్ తీసుకుంటున్నారని అన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

# కోల్‌కతా వైద్యురాలి హత్యాచారం

# పాలీగ్రాఫ్ పరీక్షలో భిన్న కథనాలు

### తాను వెళ్లేవరకు మరణించిన స్థితిలో డాక్టర్

### నిందితుడు సంజయ్‌రాయ్ వెల్లడించినట్లు కథనాలు





కోల్‌కతా,ఆగస్టు 26,ప్రజావినికిడి:

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచార ఘటనలో ప్రధాన నిందితుడు సంజయ్‌రాయ్‌కి ఇటీవల పాలీగ్రాఫ్ పరీక్షలు నిర్వహించారు. జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా ప్రస్తుతం అతడు కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ జైల్లో ఉండగా అక్కడే ఈ లై డిటెక్టర్ పరీక్ష చేపట్టారు. ఇందులో నిందితుడు ఏం చెప్పారన్న వివరాలను అధికారులు గోప్యంగా ఉంచారు. అయితే, పాలీగ్రాఫ్ పరీక్షలో నిందితుడు అసత్యం, పొంతన లేని సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. తాను వెళ్లేసరికే వైద్యురాలు చనిపోయిందని అతడు చెప్పినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో ఆగస్టు 9న ఈ దారుణం వెలుగుచూసిన సంగతి తెలిసిందే. ఆ మరుసటి రోజే సివిక్ వాలంటీర్ అయిన సంజయ్ రాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ కోర్టు ఆదేశాలతో నిందితుడికి పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్ష సమయంలో సంజయ్ అనాలోచితంగా, ఆత్రుతగా ఉన్నట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. అధికారులు అడిగిన ప్రశ్నలకు అవాస్తవాలు, సరిపోలని సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. దర్యాప్తు బృందం ఆధారాలు చూపించి నప్పుడు.. ఆ సమయంలో తాను అక్కడ లేనని నిందితుడు చెప్పాడట. అంతేగాక, తాను సెమినార్ హాల్‌కు వెళ్లేసరికి వైద్యురాలు అప్పటికే చనిపోయి ఉందని, భయంతో తాను అక్కడి నుంచి పారిపోయానని సంజయ్ చెప్పినట్లు సదరు కథనాలు వెల్లడించాయి. మరోవైపు, నిందితుడికి పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించే సమయంలో అతడి తరఫు డిఫెన్స్ లాయర్ లేకపోవడం చర్చనీయాంశమైంది. దీనిపై న్యాయవాది స్పందిస్తూ.. పరీక్ష ఎక్కడ నిర్వహిస్తామన్నది అధికారులు తమకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని, ఇది మానవహక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని ఆరోపించారు. కాగా.. వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడింది తానేనంటూ అంతకు ముందు కోల్‌కతా పోలీసుల ఎదుట నిందితుడు నేరం అంగీకరించినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇటీవల సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి చెందిన వైద్యబృందం నిందితుడి మానసిక తీరును విశ్లేషించింది. ఘటన సమయంలో ప్రతీ నిమిషం చోటుచేసుకున్న విషయాలను నిందితుడు గుక్కతిప్పకుండా మొత్తం ఎపిసోడ్‌ను వివరించాడని, అతడిలో పశ్చాత్తాపమే లేనట్లు కన్పించిందని కేసు దర్యాప్తులో పాల్గొన్న ఓ సీబీఐ అధికారి చెప్పినట్లు కథనాలు వెలువడ్డాయి. అయితే, ఆ తర్వాత అతడిని కోర్టులో హాజరుపర్చగా.. సంచలన ఆరోపణలు చేశాడు. తానే తప్పు చేయలేదని, కావాలనే తనను ఇందులో ఇరికించారని న్యాయస్థానంలో కన్నీళ్లు పెట్టుకున్నాడు.

# త్వరలో 35 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తాం

(మొదటి పేజి తరువాయి)

2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ అథ్లెట్లకు అత్యధికంగా పతకాలు వచ్చేలా కృషి చేస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో 25 నుంచి 30 ఎకరాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తాం. గత ప్రభుత్వం వర్సిటీలను నిర్వీర్యం చేసింది. 10, 15 రోజుల్లో అన్ని వర్సిటీలకు నూతన వైస్ ఛాన్సలర్లను నియమిస్తాం. వర్సిటీల్లోని అన్ని ఖాళీ పోస్టులను భర్తీ చేస్తాం. కొందరు ఉద్దేశపూర్వకంగా నిరుద్యోగులను రెచ్చగొడుతున్నారు. తద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు." అని రేవంత్ అన్నారు.డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలో అభ్యర్థులకు ఇలా సాయం చేయడం మొదటిసారి అన్నారు. అభ్యర్థులకు ఎంతోకొంత సాయం చేయాలన్న ఉద్దేశంతో చెక్కుల పంపిణీ చేస్తున్నామంటూ డిప్యూటీ సీఎం చెప్పారు. ఇది రాష్ట్రానికి ఉపయోగపడుతుందని ఆశిస్తున్నామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సింగరేణి సీఎండీ బలరాం తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో మత్తు కలకలం!

హైదరాబాద్,ఆగస్టు 26,ప్రజావినికిడి:

హైదరాబాద్ నగరం బోయిన్?పల్లి పరిధిలో భారీగా డ్రగ్స్‌ను పట్టుకున్నారు. పక్కా సమాచారంతో హైదరాబాద్ పోలీసులు, నార్కోటిక్ బ్యూరో జాయింట్ ఆపరేషన్ చేశారు. రూ.8.5 కోట్ల విలువైన 8.5కిలోల ఎఫిటమిన్ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి ఒక కారు, మూడు సెల్?ఫోన్లు సీజ్ చేశారు. అరెస్టయిన వారిలో పెడ్లర్ నాగరాజు, వినోద్ కుమార్, శ్రీశైలం ఉన్నారు.
%డ్రగ్స్ అమ్ముతున్న నైజీరియాకు చెందిన ఓ మహిళను రాజేంద్రనగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఆమెతో పాటు ఉన్న నలుగురు పరారయ్యారు. వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. నిందితురాలి నుంచి 50గ్రాముల ఎండీఎంఏ, 25 గ్రాముల కొకైన్?ను స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు నుంచి తీసుకొచ్చి హైదరాబాద్?లో సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

# కొనసాగుతున్న హైడ్రా దూకుడు

## రాయదుర్గంలో ఆక్రమణల కూల్చివేత

(మొదటి పేజి తరువాయి)

. ప్రభుత్వ స్థలాన్ని అంగులం ఆక్రమించిన తీవ్రంగా స్పందిస్తోంది. తాజాగా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలో ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. రాయదుర్గం సర్వే నంబర్ 3, 4, 5, 72లోని ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా కట్టిన భవనాలను కూల్చివేస్తున్నారు. అయితే తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా చర్యలు చేపట్టారంటూ జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులను స్థానికులు అడ్డుకున్నారు. తమ ఇళ్లను కూల్చవద్దంటూ ఆందోళనకు దిగారు. అధికారులతో స్థానికులు వాగ్వాదానికి దిగారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అధికారుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి పోలీసులు భారీగా చేరుకున్నారు. పోలీసుల ఆధ్వర్యంలో కూల్చివేతల పర్వం సాగుతోంది. తెలంగాణ ప్రభుత్వ ఆస్తుల రక్షణ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రా వ్యవస్థను తీసుకువచ్చారు. ప్రభుత్వ ఆస్తుల సంరక్షణెళి లక్ష్యంగా ఆ వ్యవస్థను ఏర్పాటు చేశారు. నగరంలో జనాభా పెరిగిపోతుండడంతో ఇష్టాను సారంగా చెరువులు, ప్రభుత్వ భూములు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. సరైన పర్యవేక్షణ వ్యవస్థ లేకపోవడంతో ఇన్నాళ్లూ ఆక్రమణదారులు ఆడిందే ఆటగా, పాడిందే పాటగా సాగింది. హైడ్రా రావడంతో నగర పరిధిలో చర్యలు చేపడుతోంది. ఇటీవల సినీనటుడు నాగార్జునకు చెందిన మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్‌ను అధికారులు కూల్చివేశారు. కూల్చివేతలను అడ్డుకునేందుకు ఆయన హైకోర్టును సైతం ఆశ్రయించారు. అయితే ఈ లోపే అధికారులు దాన్ని నెలమట్టం చేశారు. మరోవైపు బీఆర్ఎస్ నేత, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి చెందిన అనురాగ్ యూనివర్శిటీపై కూడా ఆరోపణలు వచ్చాయి. అక్రమంగా భూములు కబ్జా చేసి నిర్మాణాలు చేశారంటూ ఆయనపై ఇప్పటికే పలు కేసులు నమోదు అయ్యాయి. మరోవైపు అధికార పార్టీ నేతలను సైతం హైడ్రా వదిలిపెట్టడం లేదు. ఇలా చిన్నా, పెద్ద తేడా లేకుండా హైడ్రా ఆక్రమణదారుల బెండు తీస్తోంది.ు

# రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి: కేటీఆర్

హైదరాబాద్,ఆగస్టు 26,ప్రజావినికిడి:

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ రాష్ట్రంలో పెరుగుతున్న డెంగీ మరణాలపై ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. 'తెలంగాణలో డెంగీ మరణాలు లేవని ప్రభుత్వం చెబుతోంది. కానీ, వార్తా పత్రికల్లో మాత్రం ఒక్కరోజులో ఐదు మంది డెంగీతో చనిపోయినట్లు కథనాలు వచ్చాయి. డెంగీతో మరో ముగ్గురు చనిపోయినట్లు ఇవాళ కూడా వార్తా పత్రికల్లో వార్తలు ఉన్నాయి. ఈ డేటాను ఎవరు దాచిపెడుతున్నారు..? ఎందుకు దాచిపెడుతున్నారు..? అని కేటీఆర్ మండిపడ్డారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరిపడా మందులు, బెడ్స్ లేవు. చాలా ఆసుపత్రుల్లో ఒక్కో బెడ్‌పై ముగ్గురు, నలుగురు రోగులు ఉండి చికిత్స పొందుతున్న దారుణపరిస్థితి' అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ పరిస్థితిని సీరియస్‌గా పరిగణించి, రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని రాష్ట్ర ప్రధానకార్యదర్శి శాంతికుమారిని కేటీఆర్ కోరారు. అలాగే వివిధ వార్తా పత్రికల్లో డెంగీ మరణాలపై ప్రచురితమైన కథనాల తాలూకు క్లింపింగ్స్‌ను ఈ ట్వీట్‌కు కేటీఆర్ జత చేశారు.

# పేదలకు ప్రత్యామ్నాయం చూపాలి

### హైడ్రా కూల్చివేతలపై తెలంగాణ బీజేపీ కీలక నిర్ణయం

హైదరాబాద్,ఆగస్టు 26,ప్రజావినికిడి:

చెరువులు, నాలాల్లోని ఆక్రమణల కూల్చివేతలపై తెలంగాణ బీజేపీ కీలక నిర్ణయం తీసుకుంది. పెద్దపెద్దవారి అక్రమ కూల్చివేతలు ఫర్వాలేదు కానీ... పేదల జోలికి వస్తే మాత్రం ఊరుకునేది లేదని ఆ పార్టీ అంటోంది. హైడ్రా కూల్చివేతలపై బీజేపీ నేతలు సోమవారం కీలక సమావేశం నిర్వహించారు. రంగారెడ్డి, మేడ్చల్ అర్బన్, రూరల్ జిల్లాల అధ్యక్షులతో పాటు పలువురు సీనియర్ నేతలు పాల్గొన్నారు. హైడ్రా కూల్చివేతలపై వీరు చర్చించారు.

చెరువులు, నాలాలను ఆక్రమిస్తూ నిర్మించిన కట్టడాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో బీజేపీ డిమాండ్ చేసింది. ఎఫ్‌టీఎల్‌లో పట్టా భూములు ఉన్న పేదలకు ప్రత్యామ్నాయం చూపాలని పేర్కొంది. ప్రతిపక్షాలను టార్గెట్ చేస్తూ హైడ్రా కూల్చివేతలు జరిపితే ఊరుకునేది లేదని బీజేపీ హెచ్చరించింది. అయితే పెద్దవాళ్లు అక్రమంగా నిర్మించిన కట్టడాల కూల్చివేతలను బీజేపీ సమర్థించింది. కానీ పేద, మధ్య తరగతి ప్రజల ఆస్తులను కూల్చివేస్తే న్యాయపోరాటానికి సిద్ధమని చెబుతోంది.

సల్కం చెరువుపై బీజేపీ ట్వీట్

సల్కం చెరువులో అక్రమ నిర్మాణాలు చేపట్టారంటూ బీజేపీ ట్వీట్ చేసింది. 2012లో వ్యవసాయ భూమి ఉండగా, 2024లో ఫాతిమా ఒవైసీ కాలేజి వచ్చిందంటూ శాటిలైట్ ఇమేజ్‌లను జత చేసింది. ఫాతిమా ఒవైసీ... ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ కుమార్తె అని వెల్లడించింది. ఈ నిర్మాణాలపై చర్యలు తీసుకునే ధైర్యం హైడ్రా చేయగలదా? అని రేవంత్ సర్కారును ప్రశ్నించింది.

# బెయిల్ వచ్చేనా?

హైదరాబాద్,ఆగస్టు 26,ప్రజావినికిడి:

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో బిఆర్ఎస్ ఎంఎల్‌సి కవిత బెయిల్ పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టు తుది తీర్పును వెలువరించనుంది. ఈ నేపథ్యంలో బిఆర్ఎస్ ఎంఎల్ఎలు, కీలక నేతలతో కలిసి ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, పార్టీ అగ్రనేత హరీశ్‌రావులు ఢిల్లీకి వెళ్లారు. ఈ కేసులో ఇప్పటికే మనీష్ సిసోడియాకు బెయిల్ లభించిన నేపథ్యంలో ఎంఎల్‌సి కవితకు కూడా బెయిల్ లభిస్తుందని బిఆర్ఎస్ అధిషానం ధీమాగా ఉన్నట్లు తెలుస్తోంది. కవితకు బెయిల్ వస్తే సాదరంగా ఆహ్వానించి హైదరాబాద్‌కు తీసుకువచ్చేందుకు పార్టీ నేతలు ఢిల్లీకి వెళ్లినట్లు సమాచారం.ఎంఎల్‌సి కవితకు జులై 1వ తేదీన బెయిల్ ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. దీంతో కవిత ఈ తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ఇప్పటికే వాదనలు పూర్తి కాగా, మంగళవారానికి



(ఆగస్టు 27) సర్వోన్నత న్యాయస్థానం తీర్పును వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో ఎంఎల్‌సి కవితకు బెయిల్ వస్తుందని బిఆర్ఎస్ బలంగా విశ్వసిస్తుంది. ఈ క్రమంలోనే బిఆర్ఎస్ నేతలు కవితకు స్వాగతం పలికేందుకు ఢిల్లీకి క్యూ కట్టారు. బిఆర్ఎస్ ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు, రాజ్యసభ సభ్యులు, కీలక నేతలంతా ఢిల్లీకి తరలివెళ్లినట్లు తెలిసింది. అయితే మంగళవారం కవితకు బెయిల్ వస్తుందా..? లేదా..? అనే విషయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.ు

### బెయిల్‌పై న్యాయనిపుణుల భరోసా

ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో మనీష్ సిసోడియాకు బెయిల్ లభించిన నేపథ్యంలో బిఆర్ఎస్ ఎంఎల్‌సి కవితకు సైతం బెయల్ లభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు కవిత తీవ్ర అనారోగ్యంతో బాదపడుతున్నారు. ఆ కోణంలోనైనా సుప్రీంకోర్టు బెయిల్ ఇస్తుందని బిఆర్ఎస్ బలంగా నమ్ముతున్నట్లు తెలిసింది. మరోవైపు ఇటీవలే బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, పార్టీ అగ్రనేత హరీశ్ రావులు ఢిల్లీలో న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపి కవిత బెయిల్ అంశంపై చర్చించారు. అయితే న్యాయనిపుణులు బెయిల్ వస్తుందని భరోసా కల్పించినట్లు తెలుస్తోంది.

# కొత్తూరు పాటు కాలువకు విముక్తి కలిగేనా...?









## హైడ్రాతో చిగురించిన ఆశలు...

హైడ్రా ఏర్పాటుతో కొత్తూరుకు న్యాయం జరిగేనా..?

హెచ్ఎండిఎ పరిధిని హైడ్రా పరిధిలోకి తీసుకురావాలి..

హైడ్రాను స్వాగతిస్తున్న స్థానికులు..

కొత్తూరు మున్సిపాలిటీలో దర్జాగా పాటు కాలువ కబ్జా ఫంక్షన్ హాల్ నిర్మాణం పట్ల చర్యలకు డిమాండ్.

అక్రమంగా గోడౌన్ల నిర్మాణాలు..

పాటు కాల్వ కబ్జాతో గణపతి కాలనీకి ఏర్పడ్డ ముప్పు

వర్షాకాలంలో నిండా మునుగుతున్న గణపతి కాలనీ..

ఇబ్బందుల్లో కాలనీవాసులు.. పట్టించుకోవాలని వేడుకోలు..

ఏ పార్టీ అధికారంలో ఉన్న ఆ పార్టీ నేతలతో సత్సంబాలు కొనసాగిస్తున్న సదరు యజమాని..

పలుమార్లు అధికారులకు ఫిర్యాదు..

అయినా ఫలితం శూన్యం..

ప్రజావినికిడి,(కొత్తూరు):

హైడ్రా ఏర్పాటుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో డిమాండ్ పెరగడంతో రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండల కేంద్రంలోని గణపతి కాలనీ వాసులకు ఆశలు చిగురించాయి. పాటు కాలువలు, ఎఫ్టిఎల్,బఫర్ జోన్లను కబ్జా చేసి నిర్మించిన అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేయడమే లక్ష్యంగా హైడ్రా ముందుకు వెళుతుంది. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎఫ్ టి ఎల్, పాటు కాలువలు,బఫర్ జోన్ లను కబ్జా చేసి నిర్మించిన అక్రమ కట్టడాలపై ప్రత్యేక దృష్టి సారించి హైడ్రాను ఏర్పాటు చేశారు. అక్రమ కట్టడాలు చేపట్టిన అక్రమార్కులు ఎంతటి వారైనా, చివరకు సొంత పార్టీ వారైనా ఉపేక్షించేది లేదని వారిపై హైడ్రా ఉక్కు పాదం మోపుతుందనీ చెప్పడంతో సర్వత్ర హర్షం వ్యక్తం అవుతుంది.హైడ్రా ఏర్పాటుతో కొత్తూరు మున్సిపాలిటీలోని గణపతి కాలనీవాసులకు ఆశలు చిగురించాయి.సాయి రెడ్డి చెరువు నుండి కాశన్న కుంట వరకు గల పాటు కాలువ సమీపంలో సర్వే నెంబరు 19, 20 లలో ఎల్ పి నెంబర్ 25 / 08/%ఎ=హా/ఎ%2 తో 2008లో రియాల్టర్లు గణపతి వెంచర్ ఏర్పాటు చేసి ప్లాట్లను అమ్మేశారు. ఫ్లాట్ లైతే అమ్మారు కానీ మౌలిక వసతులు కల్పించలేదు.గణపతి వెంచర్ సమీపంలో సాయిరెడ్డి చెరువు నుండి కాశన్న కుంట వరకు పారుతున్నటువంటి పాటు కాలువను కబ్జా చేసి సదరు కాలువను దారి మళ్లించి స్థానిక నేత గణపతి పేరుతో ఫంక్షన్ హాల్ నిర్మాణం చేశారు. దీంతో వర్షాకాలంలో వస్తున్నటువంటి నీరు సాఫీగా వెళ్లకపోవడంతో వెనక్కి కొట్టడంతో గణపతి కాలనీలో గల ఇండ్లలోకి నీరు వచ్చి చేరుతుంది. దీంతో కాలనీలో దోమలు విషసర్పాలు బెడదతో అక్కడి స్థానికులు బిక్కుబిక్కుమంటూ జీవనం కొనసాగిస్తున్నారు. గణపతి కాలనీలో మౌలిక వసతులు, పాటు కాలువ కబ్జా చేసి నిర్మించిన ఫంక్షన్ హాల్ పై స్థానిక యువనేత శివచారి పలుమార్లు మున్సిపల్ కమిషనర్, హెచ్ఎండిఏ అధికారులు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వారికి న్యాయం జరిగేందుకు శాయి శక్తుల కృషి చేస్తూనే ఉన్నారు.చర్యలకై జంకుతున్న అధికారులు... పట్టు వదలని విక్రమార్కుడిలా కొత్తూరు కి చెందిన యువ నేత శివచారి పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు అందజేశారు.దీంతో ఇరిగేషన్ అధికారులు మున్సిపల్ అధికారులతో కలిసి సర్వే చేసి కబ్జా వాస్తవమేనని గుర్తించి ఫంక్షన్ హాల్ యజమానికి నోటీసులు సైతం అందించారు.కబ్జా జరిగినట్టు అధికారులు గుర్తించిన సదరు నేత అధికారంలో ఏ పార్టీ ఉన్న ఆ పార్టీ నేతలతో సఖ్యంగా ఉండడంతో చర్యలు తీసుకోవడానికి వెనకడుగు వేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నేతలతో సత్సంబాలు కొనసాగిస్తున్నాడు. ఇకనైనా అధికారులు స్పందించి కాలువను కబ్జా చేసి నిర్మించిన గణపతి గార్డెన్ తోపాటు అక్రమంగా నిర్మించిన గోడౌన్ లను వెంటనే తొలగించి న్యాయం చేయాలని స్థానికులు మీడియాకు ఈ ప్రకటన ద్వారా కోరుతున్నారు. కొత్తూరులో అంశంపై సర్వత్ర ఆసక్తి నెలకొందని శివచారి పేర్కొంటున్నారు. సమాజానికి ఉపయోగపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే బాగుంటుందని శివచారి డిమాండ్ చేశారు.



## కరాటే విద్యార్థులకు బెల్టుల ప్రదానం

### విద్యార్థులు క్రీడల్లో రాణించాలి: అంజనాదేవి




ప్రజావినికిడి,(ఎల్బీనగర్):ఆగస్టు 26: విద్యార్థులు చదువులతో పాటు క్రీడా రంగాల్లో రాణించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని శ్లోక ది గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపల్ అంజనాదేవి పిలుపునిచ్చారు. యొద్ద గోజుర్యు స్పోర్ట్స్ కరాటే డు ఆర్గనైజేషన్ మాస్టర్ పి.ఎం.రాము ఆధ్వర్యంలో శిక్షణ పొందిన కరాటే విద్యార్థులకు బెల్టుల ప్రదానం చేశారు. బెల్టుల ప్రదానోత్సవ కార్యక్రమానికి శ్లోక ది గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపల్ అంజనాదేవి ముఖ్య అతిథిగా హాజరై కరాటేలో శిక్షణ పొందిన విద్యార్థులకు బెల్టులను ప్రదానం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,శరీర దారుఢ్యానికి కరాటే శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.ప్రతిఒక్క విద్యార్థి విద్యతో పాటు క్రీడారంగాల్లో రాణించాలని సూచించారు. అంతకుముందు అతిథులను మాస్టర్ పి.ఎం.రాము, నిర్వాహకులు శాలువతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వి.రాజశేఖర్ గౌడ్, బి.రాము,ఎ.సతీష్, టి.సంజీవ్ సింగ్, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రజావినికిడి,(కొత్తపేట):
కృష్ణ జన్మాష్టమి సందర్భంగా..
జయంతిక అండ్ అక్షద సాయి.. గోపిక శ్రీకృష్ణ వేషధారణలో చిన్నారులు..
కొత్తపేట మోహన్ నగర్ లో..

## అత్యంత ప్రమాదకరమైన కెమికల్ వ్యర్థాల వల్లే చేపలు మృతి..

### మత్య కారులు సంఘం నేతలు ఆరోపణ

### దూసకల్ సూరమోని గుంటలో భారీగా చేపలు మృతి



ప్రజావినికిడి,(షాద్ నగర్): దూసకల్ సమీపంలో ఉన్న చాక్లెట్ పరిశ్రమ నుండి వెలువడే కెమికల్, వ్యర్థాలు, విష వాయువుతోనే భారీ స్థాయిలో చేపలు మృతి చెందాయని మత్స్యకారుల సంఘం నేతలు ఆరోపిస్తూ కంపెనీ ఎదుట ఆందోళన చేపట్టారు. ఫరూఖ్ నగర్ మండలం దుసకల్ – చటాన్ పల్లి బైపాస్ సమీపంలో ఉన్న సురమోని చెరువులో భారీ స్థాయిలో కుప్పలు తెప్పలుగా చేపలు మృత్యు వాత వాతపడ్డాయి.దీనికి ప్రధాన కారణం పక్కన ఉన్న చాక్లెట్ పరిశ్రమ నుండి వెలువడే వ్యర్థాలు విషవాయులు నీరు చెరువులోకి చేరడంతోనే పెద్ద ఎత్తున చేపలు మృతి చెందాయి.అత్యంత ప్రమాదకరమైన కెమికల్ వ్యర్థాల వల్లే చేపలు చనిపోయి ఉంటాయని మత్య కారులు సంఘం నేతలు ఆరోపించారు. దీంతో మత్స్యకారులు చేపలతోనే జీవనోపాధి కోల్పోయామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.చేపల మృతికి కారణమైన పరిశ్రమ యజమాన్యం నష్ట పరిహారం చెల్లించాలని మత్య కారులు సంఘం నేతలు డిమాండ్ చేశారు.

## నాగోల్ లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు..



ప్రజావినికిడి,(నాగోల్): శ్రీకృష్ణాష్టమి సందర్భముగా నాగోల్ శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం శ్రీకృష్ణ అష్టమి వేడుకలు ఘనంగా ఉత్సవంగా జరుపు కున్నారు.ఈ సందర్భముగా శ్రీకృష్ణ బగవానునికి పూజ జరిపి శ్రీ కృష్ణుని ఉరేగింపు ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు చింతల సురేందర్ యాదవ్, నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, నాగోల్ డివిజన్ యాదవ సంఘం అద్యక్షులు చింతల కిరణ్ కుమార్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డివిజన్ లో శ్రీకృష్ణుని ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమం లో సంఘం ఉపాధ్యక్షులు బైకన్ సతీష్ యాదవ్, ట్రెజరర్ సిఎచ్ జనార్ధన్ యాదవ్,సంఘం ప్రధాన కార్య దర్శి జి. కృష్ణా యాదవ్,ప్రదీప్ యాదవ్,యాదయ్య, రాజు యాదవ్,గిరి యాదవ్,రాంచందర్ యాదవ్,మర్రి, శ్రీశైలంయాదవ్,బైకన్ మహేష్ యాదవ్,కన్నా యాదవ్,సాయి కిరణ్ యాదవ్ తదితర యాదవ కుల పెద్దలు పెద్ద ఎత్తున పాల్గోని విజయవంతంగా నిర్వహించారు.

## జాతీయ రహదారి రోడ్డు పనులను అధికారులతో కలిసి పనులను పరిశీలించిన చేవెళ్ల ఎం.పీ.కొండా విశ్వేశ్వర్ రెడ్డి..

### రాజేంద్ర నగర్, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి...






ప్రజావినికిడి,(రాజేంద్ర నగర్):ఆగస్టు 26, రాజేంద్ర నగర్ నియోజక వర్గం శంషాబాద్ లోని తొండు పల్లి లో అభివృద్ధి పనులలో భాగంగా నేషనల్ హైవే పనులను చేవెళ్ల పార్లమెంట్ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కలిసి రాజేంద్ర నగర్ నియోజక వర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి నేషనల్ హైవే అధికారులతో కలిసి పనులను పర్యవేక్షించడం జరిగింది.ఈ సందర్భంగా మాట్లాడుతూ, తొండుపల్లి గ్రామంలో జాతీయ రహదారి 44 పైన బ్రిడ్జి నిర్మాణం పనులు జరుగుతున్నాయి.దీని కారణంగా చాలా ఇబ్బందులూ ఎదురవుతున్నాయి ఈ రోడ్డు 200 పీట్లు ఉన్నది కానీ కొందరు వ్యక్తులు ఆక్రమించి కబ్జా చేసి డబ్బులు వేసుకొని రహదారి పై ప్రయాణాలు కొనసాగించే వాహనదారులకు చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారని రింగురోడ్డు ఎగ్జిట్ 16 ఇక్కడే ఉన్నందున ట్రాఫిక్ జాం అయ్యి ప్రజల వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెల్లడించారు. అందువల్ల రోడ్డుకు సంబంధించి రెండు టోల్ గేట్లను అదనంగా పెంచాలని కోరడం జరిగింది.రోడ్డుపైన కబ్జాలు చేసిన డబ్బాలన్ తొలగించి 200 ఫీట్ల రోడ్డును స్వాధీనం చేసుకుని సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి కు విన్నవించడం జరిగింది.సర్వీస్ రోడ్ లేనందున ట్రాఫిక్ పోలీసులు కూరగాయలు తీసుకుపోయిన రైతులకు వారి బండ్లపై ఇలా చాలాన్లు వేయడం జరుగుతున్నదని తెలియడం జరిగింది. సానుకూలంగా స్పందించిన నేషనల్ హైవే అధికారులు త్వరితగతిన సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తామని సందర్భంగా హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే ఆఫీసర్ ధర్మా రెడ్డి,సరిత, శంషాబాద్ మున్సిపల్ ప్రెసిడెంట్ దేవేందర్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ బతుకు శ్రీనివాస్ యాదవ్,కోలాన్ ప్రదీప్ రెడ్డి,భాను రెడ్డి, జజ్జీవన్ రెడ్డి,పరమేష్ గౌడ్,మల్లేష్,శ్రీకాంత్ గణేష్,సురేందర్, మల్లేష్ యాదవ్, బాలరాజ్,తదితరులు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని వృద్ధుని మృత దేహం...



ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):
దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గండి మైసమ్మ నుండి మేడ్చల్ వెళ్లే ప్రధాన రహదారి సమీపం లో, పెద్ద మసీదు ముందు గుర్తుతెలియని వృద్ధుని మృతదేహం గుర్తించిన స్థానికులు..పోలీస్ వారికి సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని,గాంధీ మార్చురికి తరలించారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న దుండిగల్ పోలీసులు.

# శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలో పాల్గొన డిప్యూటీ మేయర్, ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు..



ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):
నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిజాంపేట్ శ్రీనివాస్ నగర్ అయ్యప్ప స్వామి దేవాలయం నందు సురేందర్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలో నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్,ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ, కార్పొరేషన్ ప్రజలకు శ్రీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు సాంబాశివా రెడ్డి, సురేందర్ కుమార్ యాదవ్,సుబ్బు,శివ కుమార్ యాదవ్, వెంకట్ రామ రావు, ఓంకార్,వెంకట్ రావు యాదవ్,మహేశ్వర్ రెడ్డి,కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మదర్ థెర్రిస్సా జయంతి వేడుకల్లో పాల్గొని ఘననివాళులు అర్పించిన కొలన్ హన్మంత్ రెడ్డి..







ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ రాజీవ్ గృహకల్పలో మదర్ థెర్రిస్సా 114వ, జయంతి వేడుకల్లో పాల్గొని విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి అనంతరం మదర్ థెర్రిస్సా చారిటీ వారు ఏర్పాటు చేసిన రక్తదాన శిభిరంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి,ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి,ఎన్ఎంసి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి మరియు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రక్తదానం చేయండి ప్రాణ దాతలు కండి..

## టిపిసిసి ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్త..




ప్రజావినికిడి,(ఎల్బీనగర్):రక్తదానం చేసి ప్రాణ దాతలు కండి అని టి పిసిసి ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ అలాగే రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు.సోమవారం మదర్ థెరిస్సా 114 వ, జయంతి సందర్భంగా మదర్ థెరిస్సా చారిటబుల్ సొసైటీ చేపూరి శేఖర్ ఆధ్వర్యంలో సెల్ఫ్ ఫైనాన్స్ రెసిడెంట్స్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ వనస్థలిపురం లో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరం లో హై కోర్టు రిటైర్డ్ జడ్జి బి.చంద్ర కుమార్ తో కలిసి ఆయన అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ఆయన సూచించారు.రక్తదానం చేయడం వల్ల మనిషి ఆరోగ్యం గా ఉంటాడు అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కోటేశ్వర రావు,శేషు, శ్రీనివాస్ రెడ్ క్రాస్ చైర్మెన్ నర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# షాపూర్ నగర్ లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు..



ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):
కుత్బుల్లాపుర్ నియోజకవర్గం 129 డివిజన్ న్యూ షాపూర్ నగర్ లో శ్రీ కృష్ణ జన్మస్టమి సందర్బంగా ముద్దాపురం సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేసి నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖ:సంతోషాలతో ఉండాలని కోరిన అనంతరం ఉట్టి కార్యక్రమంలో పాల్గొన్నా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి.ఈ కార్యక్రమంలో 129 డివిజన్ మాజీ కార్పొరేటర్ పాలక్రిష్ణ, డీసీసీ ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్,నర్సింగ్ రావు,సిద్ధనోళ్ల సంజీవరెడ్డి,పెరిక శివ, రజాక్ మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి.. పేదలకు పెన్నిధి..



ప్రజావినికిడి, (కుత్బుల్లాపూర్):
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ మంజూరు చేయించిన 60,000/- రూపాయల విలువ గల"సీఎం సహాయ నిధి" చెక్కును నిజాంపేట్ లోని డిప్యూటీ మేయర్ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్,ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ తో కలిసి లబ్ధిదారుడు సత్తయ్య కు చెక్కును పంపిణీ చేశారు.ఈ సందర్బంగా లబ్ధిదారుడు సత్తయ్య ఎమ్మెల్యే కేపీ వివేకానంద కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బొర్రా చందు ముదిరాజ్, నాయకులు సాంబాశివా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ నేత ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ కీ పలు ఆహ్వానాలు..



ప్రజావినికిడి, (కుత్బుల్లాపూర్): కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజలు,నాయకులు, అభిమానులు, కార్యకర్తలు,సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్యే కేపీ.వివేకానంద ని కలిసి పలు వినతులు ఆందజేయగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

# ప్రగతి నగర్ లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు..



ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):కుత్బుల్లాపుర్ నియోజకవర్గం నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ ప్రగతినగర్ లోని అయ్యప్ప స్వామి ఆలయం కమిటీ వారు ఏర్పాటు చేసిన శ్రీ కృష్ణ జన్మస్టమి ఉత్సవాల్లో పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేసి నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖ:సంతోషాలతో ఉండాలని కోరిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఎంసికాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి మరియు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రపంచ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్, జూనియర్ ఆసియా ఛాంపియన్‌షిప్ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన సిద్దార్థ్ కలియాను అభినందించిన డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్..



ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ ధర్మరెడ్డి కాలనీ కి చెందిన సిద్దార్థ్ కలియా అండర్-14, సెప్టెంబర్ 6,7,8వ తేదీలలో ప్రపంచ ఛాంపియన్ షిప్ ఫకట్ థాయిలాండ్,9,10వ తేదీలలో జూనియర్ ఆసియా ఛాంపియన్‌షిప్ ఆధ్వర్యంలో జరగనున్న స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారు. స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొననున్న విద్యార్థి డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ డిప్యూటీ మేయర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ వారిని అభినందించారు. స్విమ్మింగ్ లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలని, మన దేశానికి,మన రాష్ట్రానికి, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో దినేష్ రాజోరియా (తెలంగాణ ఫిన్స్ స్విమ్మింగ్ జనరల్ సెకరేటరీ),విజయ్ సింగ్ (ట్రైనర్),తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ యాదవ సమితి ఆధ్వర్యంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు..





ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో కృష్ణాష్టమి సందర్భంగా శ్రీ కృష్ణ యాదవ సమితి వారు నిర్వహించిన శ్రీ కృష్ణాష్టమి వేడుకలలో రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ బండ్రు శోభారాణి మరియు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ తో కలిసి పాల్గొన్న టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు..




ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):
శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా,127 రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని నందానగర్ లో, కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో,స్కూల్ మేనేజ్మెంట్ వారు నిర్వహించిన శ్రీ కృష్ణాష్టమి వేడుకలకు ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీరాష్ట్రనాయకులు, కె.యం.ప్రతాప్ విచ్చేసి వేడుకలలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రతాప్ చిన్నారులకు శ్రీ కృష్ణాష్టమిశుభాకాంక్షలనుతెలియజేశారు.మన సంస్కృతి, సంప్రదాయాలను వేడుకలద్వారా నిర్వహిస్తూ భావితరాలకు తెలియజేస్తున్నందుకు స్కూల్ మేనేజ్మెంట్ వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్,అధ్యాపకులు, పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు స్థానిక కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.?

# మదర్ తెరిసా గోల్డ్ మెడల్ అవార్డు 2024 ను అందుకున్న బిషప్ డాక్టర్ వై ఎన్ మూర్తి




ప్రజావినికిడి,(హైదరాబాద్):పెద్ద అంబర్పేట్ పరిధిలోని బైబిల్ మిషన్ వ్యవస్థాపకులు బిషప్ డాక్టర్ వై.ఎన్ మూర్తి తాను చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి న్యూ లైఫ్ తియోలాజికల్ యూనివర్సిటీ మదర్ తెరిసా గోల్డ్ మెడల్ అవార్డు 2024 ను రవీంద్రభారతిలో సోమవారం నాడు అందజేసింది.వై.ఎన్ మూర్తి ఈ అవార్డు ముఖ్య అతిథులుగా విచ్చేసిన క్రిస్టియన్ మైనార్టీ చైర్మన్ దీపక్ జాన్ చేతుల మీదుగా అందుకున్నారు.ఈ సందర్భంగా డాక్టర్ వైఎన్. మూర్తి మాట్లాడుతూ మదర్ తెరిసా జయంతిని పురస్కరించుకుని ఈ అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.ఈ అవార్డు అందజేసిన న్యూ లైఫ్ తియోలాజికల్ యూనివర్సిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ ఉత్సాహంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేసి ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. ఆ ప్రభువు నాతో తోడుగా ఉండడం వల్లే నాకు ఇలాంటి సత్కారాలు సన్మానాలు అవార్డులు వస్తున్నాయని తెలిపారు. ఆ ప్రభువు ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక







కృష్ణాష్టమి సందర్భంగా కృష్ణుడు,గోపిక వేషధారణలో చిన్నారులు..

ప్రజావినికిడి, (ఎల్బీనగర్)



# అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ జరగాల్సిందే..

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టీకరణ..
### రుణమాఫీ పై సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే..



ప్రజావినికిడి,(షాద్ నగర్):
షాద్ నగర్ నియోజక వర్గం లోని వ్యవసాయ శాఖ అధికారులతో సోమవారం ఉదయం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ క్యాంప్ కార్యాలయం నందు సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం అర్హులైన ప్రతి రైతుకి రుణ మాఫీ చేయటం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.కావున వ్యవసాయ అధికారులు బ్యాంకర్లతో సమన్వయం చేసుకొని పూర్తి సమాచారాన్ని తీసుకోని ప్రతి ఒక్కరికి రుణమాఫీ అయ్యేటట్లు చూడాలని కోరారు. ఏవైనా సాంకేతిక సమస్యలు దృష్టికి వస్తే వెంటనే ఆ సమస్యను పరిష్కరించాలని లేదా పై అధికారులకు నివేదించాలని కోరారు. రుణమాఫీ కాని వారు దరఖాస్తులను వ్యవసాయ విస్తరణ అధికారులు లేదా మండల వ్యవసాయ అధికారులకు అందజేయాలనీ ఎమ్మెల్యే కోరారు.ఈ సమీక్ష సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలరాజు గౌడ్, జగదీష్ అప్ప,మండల అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, గూడ వీరేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జితేందర్ రెడ్డి,వ్యవసాయ శాఖ అదనపు సంచాలకులు రాజారత్నం,మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ కు హైడ్రా ...!

**షాద్‌నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" సంచలన వ్యాఖ్యలు..**
**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి..**
**అక్రమాలతో భవిష్యత్తు తరాలకు ప్రమాదం..**
**చెరువులు, కుంటలు,ఫీడర్ ఛానళ్ళను కాపాడుతాం..**
**ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను తొలగిస్తాం..**



ప్రజావినికిడి,(షాద్ నగర్):
తెలంగాణలో ఇప్పుడు హైడ్రా పేరు మారుమోగుతోంది. హీరో నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ కూల్చివేతతో హైడ్రా గురించి దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది.ఈ నేపద్యంలో రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కూడా షాద్ నగర్ ప్రాంతంలో హైడ్రా అమలు కోసం స్వయాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పడంతో ఈ అంశంపై సంచలనం రేకెత్తిస్తుంది. అంతేకాదు నియోజకవర్గంలో ఉదాహరణకు కొన్ని నీటి వనరులను ధ్వంసం చేసి అక్రమాలకు పాల్పడ్డ వ్యవహారాలను కూడా ఉదాహరించడంతో ఇక షాద్ నగర్ నియోజకవర్గంలో హైడ్రా రాక కోసం మార్గం సుగమం చేస్తున్నట్టు తెలుస్తుంది.

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఏమన్నారంటే..

హైదరాబాద్ లో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన హైడ్రా విధానాలతో రాష్ట్రవ్యాప్తంగా ప్రకంపనలు రేకెత్తుతున్నాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ప్రభుత్వం ఎంతో గొప్ప సాహసోపేతమైన నిర్ణయం తీసుకొని అమలు చేస్తుండడం విశేషం అన్నారు.ఏ ప్రభుత్వం ఏ పాలకులు చేయని ధైర్యాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రదర్శించారని అభినందించారు. హైడ్రా తీసుకోవచ్చి అక్రమ కట్టడాలను కూల్చుతూ చెరువులు కుంటలను ఫీడర్ ఛానల్స్ ను కాపాడుతున్న తీరును శంకర్ ప్రశంసించారు.
హైడ్రా ఒక స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థని,హైడ్రాకు సంబంధించి అధికారి రంగనాథ్ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తు తరాలు బాగుండాలంటే నీటి వనరులను,ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత పాలకులపై ఉంటుందని గుర్తు చేశారు.
షాద్ నగర్ నియోజకవర్గంలో కూడా నీటి వనరులను ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వికారాబాద్ నుండి నియోజకవర్గంలోని రెడ్డిపాలెం వరకు వచ్చే ఫిరంగి కాలువ కూడా మొత్తం ధ్వంసం చేసి అక్రమ కట్టడాలు కట్టారని నీటి వనరులకు సమస్య సృష్టించారని ఎమ్మెల్యే శంకర్ సంచలన విషయాలు చెప్పారు. ఫిరంగి కాలువపై గతంలో మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఎన్నో ఫిర్యాదులు కూడా చేశారని..ఈ సందర్భంగా గుర్తు చేయడం గమనార్హం.
అదేవిధంగా ఫరూక్ నగర్ లోని బొబ్బిలిచెరువు భూమిలో కూడా అక్రమ కట్టడాలు జరిగాయని వాటికి సంబంధించి కూడా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంటుందని అన్నారు. మిగులు జలాలు అక్కమ చెరువు,అంచు కుంట చెరువు గత పాలకుల, రియాల్టర్ల లాభాపేక్షకు కబ్జాలకు గురయ్యాయని దీంతో నీటి వనరులకు ఎంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.ఇంకా నియోజకవర్గంలో ఇలాంటి సమస్యలు కోకోలలుగా ఉన్నాయని పేర్కొన్నారు.
ఈ ప్రాంతంలో చెరువులు కుంటలు కబ్జా చేసిన దాఖలాలు ఉన్నాయని,ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలు కట్టారని వాటిని తీసిపారేసే విధంగా హైడ్రా ఇక్కడ అమలు చేసీ హైడ్రాను విస్తరించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు అందుకోసమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ విషయాన్ని విజ్ఞప్తి చేస్తున్నట్టు చెప్పారు.తన నియోజకవర్గంలో హైడ్రాను యదేచ్ఛగా అమలు చేస్తానని ఎమ్మెల్యే శంకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు.ఎమ్మెల్యే వెంట పిసిసి సభ్యులు మహమ్మద్ అలీఖాన్ బాబర్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు జగదీశ్వరప్ప,చల్లా శ్రీకాంత్ రెడ్డి,బాలరాజ్ గౌడ్,చెంది తిరుపతి రెడ్డి,గూడ వీరేశం, హరినాథ్ రెడ్డి, సయ్యద్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

# కాశ్మీర్ స్టార్ కాంపెయినర్ ప్రధాని మోడీ


### మొత్తం 40మందితో ప్రచార సారథుల జాబితా



న్యూఢిల్లీ ఆగస్టు 26,ప్రజావినికిడి: జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే 15 మంది అభ్యర్థుల తొలి జాబితాను సోమవారంనాడు విడుదల చేసిన బీజేపీ తొలి విడత ప్రచారంలో పాల్గొనే 40 మంది స్టార్ క్యాంపెయినర్ల జాబితాను కూడా విడుదల చేసింది. ఆ ప్రకారం జమ్మూకశ్మీర్ లీడ్ క్యాంపెయిర్‌గా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉంటారు. కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరి, జేపీ నడ్డా తదితరులు సైతం ఎన్నికల ప్రచారంలో కీలకంగా ఉంటారు. కాగా, స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో పలు రాష్ట్రాల ముఖ్యమంత్రుల పేర్లను కూడా ప్రకటించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ, హిమాచల్ ప్రదేశ్ సీఎం జైరామ్ ఠాకూర్ తొలిదశ ప్రచారంలో పాల్గొంటారు. బీజేపీ మాజీ ప్రధాన కార్య దర్శి, ఇటీవలే జమ్మూకశ్మీర్ ఎన్నికల ఇన్‌చార్జిగా నియమితులైన రామ్ మాధవ్, జమ్మూకశ్మీర్ పార్టీ జనరల్ సెక్రటరీ ఇన్‌చార్జి తరుణ్ చుగ్, జమ్మూకశ్మీర్ బీజేపీ చీఫ్ రవీందర్ రైనా, ఎంపీ జుగల్ కిషోర్ శర్మ, రాజ్యసభ సభ్యుడు గులాం అలీ ఖతన, ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) అశోక్ కౌల్, జమ్మూకశ్మీర్ బీజేపీ ఉపాధ్యక్షుడు సోఫి యూసుఫ్ సైతం ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. 90 మంది సభ్యుల జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి మూడు విడతలుగా సెప్టెంబర్ 18, సెప్టెంబర్ 25, అక్టోబర్ 1న పోలింగ్ జరుగుతుంది. అక్టోబర్ 4న ఫలితాలు వెలువడతాయి. 2019లో 370వ అధికరణ రద్దు, రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా రాష్ట్రాన్ని విభజించిన తరువాత జమ్మూకశ్మీర్‌లో జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలు ఇవే కావడం విశేషం.

# 'హైడ్రా'కు పెరుగుతున్న ఎమ్మెల్యేల మద్దతు..

(హైదరాబాద్):ఆగస్టు 26,ప్రజావినికిడి:
హైడ్రాకు రోజురోజుకూ మద్దతు పెరుగుతోంది. అటు పొలిటికల్‌గా..ఇటు సామాన్యుల నుంచి మద్దతు పెద్ద ఎత్తున వస్తోంది.ముఖ్యంగా ఎన్ కన్వెన్షన్ కూల్చివేత హైడ్రాకు కావల్సినంత మద్దతును కూడగట్టింది.అన్ని వర్గాల ప్రజలు దీనిపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రాపై సొంత పార్టీలో ఇబ్బందులు వస్తాయని తొలుత సీఎం రేవంత్ రెడ్డి భావించారు.కానీ ఎమ్మెల్యేలంతా రేవంత్ నిర్ణయానికి మద్దతు పలుకుతున్నారు. హైడ్రా లాంటి వ్యవస్థను రాష్ట్రమంతటా విస్తారించాలని రేవంత్‌కి ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేస్తున్నారు. హైడ్రాపై అభినందనలు తెలుపుతూ రేవంత్‌కి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, విప్ అడ్లూరి లక్ష్మణ్‌లు లేఖ రాశారు.రాజన్న సిరిసిల్ల జిల్లాలో హైడ్రా తరహా వ్యవస్థ కోసం సీఎం రేవంత్‌కి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లేఖ రాశారు. వేములవాడ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు ఎఫ్‌టీఎల్ పరిధిలో గెస్ట్ హౌజ్ కట్టాడని ఆది శ్రీనివాస్ లేఖలో పేర్కొన్నారు. హైడ్రాను తమ నియోజకవర్గంలో కూడా విస్తరించాలని సీఎం రేవంత్ రెడ్డికి షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రిక్వెస్ట్ చేశారు.నకిరేకల్



నియోజకవర్గంలో కూడా ఆక్రమణకు గురైన భూములను కాపాడాలని వేముల వీరేశం లేఖ రాశారు. ఆలేరు నియోజకవర్గంలో ఆక్రమణకు గురైన భూములు, అక్రమ కట్టడాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని సీఎంకి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య లేఖ రాశారు. తమ నియోజకవర్గంలో హైడ్రా లాంటి వ్యవస్థను తీసుకు రావాలని మానుకొండూర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్యే కాలే యాదయ్య, తదితరులు రేవంత్‌కి లేఖ రాశారు.కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి జ్ఞాన సుందర్ నేడు గాంధీ భవన్‌లో మాట్లాడుతూ,రేవంత్ రెడ్డి హైట్ కొలవగలరేమో కానీ ఆయన ఆత్మవిశ్వాసాన్ని కొలవలేరని కొనియాడారు. పేదవాడిని కొట్టడం తప్పా,పెద్ద వాళ్ళకి వ్యతిరేకంగా ఏ ప్రభుత్వం పోలేదన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎవరికీ భయపడకుండా ముందుకి పోతోందన్నారు.హైడ్రాకి ప్రజల మద్దతు ఉందన్నారు. తెలంగాణ అంతటా హైడ్రా లాంటి వ్యవస్థను విస్తరించాలని కోరారు. రేవంత్ ఆలోచనకి ప్రతిపక్షాల మైండ్ బ్లాంక్ అవుతోందన్నారు.గత ప్రభుత్వంలో అధికారులు బీఆర్ఎస్ నాయకులు చెప్పినట్టు విన్నారని..అందుకే ఫేక్ పట్టాలు పొందగలిగారని జ్ఞాన సుందర్ పేర్కొన్నారు. అయితే నగరంలో హైడ్రా మాత్రం నాన్ స్టాప్‌గా కూల్చివేతలు నిర్వహిస్తోంది. శేర్లింగంపల్లి మండలం రాయదుర్గంలో ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తోంది. రాయదుర్గం సర్వేనెంబర్ 72లో ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు వెలిశాయి.ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేతలు చేపట్టారు.భారీగా పోలీసుల మోహరించారు. కూల్చివేతలను స్థానికులు అడ్డుకుంటున్నారు.

# కుప్పకూలిన భారీ శివాజీ విగ్రహం

### గతేడాది ఆవిష్కరించిన ప్రధాని మోడీ




ముంబై,ఆగస్టు 26,ప్రజావినికిడి:
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత ఏడాది అట్టహాసంగా ఆవిష్కరించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ 35 అడుగుల ఎత్తయిన విగ్రహం సోమవారంనాడు కుప్పకూలింది. మహారాష్ట్రలోని సింధుదుర్గ్ జిల్లా రాజ్‌కోట్ ఫోర్ట్‌లోని ఈ విగ్రహం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో కూలిపోయినట్టు అధికారులు తెలిపారు. విగ్రహం కూలిపోవడానికి కారణం తెలియలేదు. అయితే, గత రెండు మూడు రోజులుగా జిల్లాలో భారీ వర్షాలు, ఈదురుగాలులు ఇందుకు కారణం కావచ్చని అనుమానిస్తున్నారు. సీనియర్ అధికారులు, జిల్లా యంత్రాంగం హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకోగా, విగ్రహం కూలిపోవడానికి కారణాలు, ఏ మేరకు నష్టం జరిగిందనే దానిపై నిపుణుల అంచనా వేస్తున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గత ఏడాది డిసెంబర్ 4న 'నేవీ డే' సందర్భంగా ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. రాజ్‌కోట్ ఫోర్ట్‌లో జరిగిన వేడుకల్లో సైతం పాల్గొన్నారు. శివాజీ మహారాజ్ 35 అడుగుల విగ్రహం కుప్పకూలడానికి ప్రభుత్వానిదే బాధ్యత అని ఎన్‌సీపీ (ఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ మంత్రి జయత్ పటేల్ ఆరోపించారు. ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోలేదని చెప్పారు. నాణ్యతా ప్రమాణాలను ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదని, కేవలం ప్రధానమంత్రితో విగ్రహావిష్కరణ చేయించడం పైనే దృష్టి పెట్టిందని విమర్శించారు. కొత్త టెండర్లు పిలవడం, కమిషన్లు తీసుకుని కాంట్రాక్టులు ఇవ్వడమే ప్రభుత్వం పనిగా పెట్టుకుందని ఎద్దేవా చేశారు. కాగా, విగ్రహ నిర్మాణంలో నాసిరకం ప్రమాణాలు పాటించినట్టు శివసేన (యూబీటీ) ఎమ్మెల్యే వైభవ్ నాయక్ ఆరోపించారు. బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందని, విగ్రహ నిర్మాణం, ఏర్పాటు చేసిన వ్యక్తులపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు.




# ఫన్ ఎంటర్‌టైనర్‌గా సుందరకాండ

నారా రోహిత్ హీరోగా వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'సుందరకాండ' సందీప్ పిక్చర్ ప్యాలస్ పతాకంపై సంతోష్ చిన్నపోళ్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. వృతి వాఘని కథానాయిక. సెప్టెంబర్ 6న ఇది ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసింది. 'నాది మూలా నక్షత్రం.. 5 నిమిషాలకు మించి హ్యాపీగా ఉండను' అని నారా రోహిత్ చెబుతున్న డైలాగులు అలరిస్తున్నాయి. ఇటీవల ప్రతినిధి 2 సినిమాతో మంచి విజయం అందుకున్న నారా రోహిత్ మరో క్రేజీ మూవీతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. ఆయన ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'సుందరకాండ' వృతి వాఘని కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా సెప్టెంబర్ 6న ప్రేక్షకుల విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా టీజర్‌ను విడుదల చేశారు. ఇక టీజర్ చూస్తే.. నాది మూలా నక్షత్రం.. 5 నిమిషాలకు మించి హ్యాపీగా ఉండను.. అంటూ తన దరిద్రమైన పాత్రను వ్యంగంగా రివీల్ చేశారు మేకర్స్. నారా రోహిత్ చాలా రోజుల తర్వాత ఫన్ ఎంటర్‌టైనమెంట్‌తో రాబోతున్నట్లు తెలుస్తుంది. శ్రీదేవి విజయ్ కుమార్, నరేష్ విజయ కృష్ణ, వాసుకి ఆనంద్, కమెడియన్ సత్య, అజయ్, ÷ం గణెళిష్, అభినవ్ గోమతం, విశ్వంత్, రూపా లక్ష్మి , సునైనా , రఘు బాబు , అమృతం వాసు , అదుర్స్ రఘు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తుండగా.. ప్రదీష్ ఎం వర్మ సినిమాటోగ్రఫీ. రోహన్ చిల్లాలే ఎడిటింగ్. ప్రొడక్షన్ డిజైన్: రాజేష్ పెంటకోట.

# క్రిస్మస్ కానుకగా గేమ్‌ఛేంజర్




టాలీవుడ్ స్టార్ యాక్టర్ రాంచరణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం గేమ్‌ఛేంజర్ స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. బాలీవుడ్ భామ కియారా అద్వానీ, రాజోలు భామ అంజలి ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ మూవీ షూటింగ్ దాదాపు పూర్తి అయినట్టు తెలుస్తోండగా.. దీనిపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కాగా ఈ చిత్రం విడుదలకు సంబంధించి ఏదో ఒక వార్త నెట్టింట హల్ చల్ చేస్తూనే ఉంది. గేమ్ ఛేంజర్ రిలీజ్ డేట్‌పై ఎప్పుడు క్లారిటీ వస్తుందా అని డైలామాలో ఉండిపోయిన అభిమానుల కోసం ఆసక్తికర వార్త ఒకటి ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. రాంచరణ్ పీఆర్ టీం ప్రకారం గేమ్ ఛేంజర్ ఈ ఏడాది క్రిస్మస్ కానుకగా డిసెంబర్‌లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇప్పటివరకు వచ్చిన వార్తలను కొట్టిపారేస్తూ.. తాజాగా ఇచ్చిన సమాచారంతో అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. విడుదల తేదీపై ఇక అధికారిక ప్రకటన రావడమే ఆలస్యమని తెలియడంతో ఆనందంలో ఎగిరిగంతేస్తున్నారు అభిమానులు. ఈ చిత్రంలో నవీన్ చంద్ర, సునీల్, శ్రీకాంత్, బాలీవుడ్ నటుడు హ్యారీ జోష్, కోలీవుడ్ యాక్టర్లు ఎస్‌జే సూర్య, సముద్రఖని, కన్నడ నటుడు జయరామ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీలో రాంచరణ్ కథానుగుణంగా తండ్రీ కొడుకులుగా కనిపించబోతున్నట్టు తెలుస్తోండగా.. తండ్రి పాత్రకు జోడీగా అంజలి కనిపించనుందట. ఈ మూవీని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు తెరకెక్కిస్తుండగా.. పాపులర్ డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజు కథనందిస్తున్నాడు. సాయిమాధవ్ బుర్రా డైలాగ్స్ అందిస్తున్నారు.

# ప్రియా వారియర్.. దేవకన్యలా

ప్రియా ప్రకాష్ వారియర్.. సోషల్ మీడియాలో ఎంతగా క్రేజ్ ఉందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. 'ఒరు ఆధార్ లవ్' అనే చిన్న మలయాళ చిత్రం నుండి సోషల్ మీడియాలో స్టార్ అయిపోయిన ఈ బ్యూటీకి అప్పటి నుండి మంచి క్రేజ్ అందుతోంది. ఓ సింపుల్ వింక్ తో కుర్రకారుని ఆకట్టుకుని ఒక్క స్మైల్‌తో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రియా, ఇప్పటివరకు అదే క్యూట్ అండ్ గ్లామర్ లుక్‌ని కొనసాగిస్తూ ట్రెండింగ్ లో ఉంది. అదే కోవలో భాగంగా, ప్రియా పలు సినిమాల్లో నటించినప్పటికీ, ఫోటోషూట్ లతో కనిపించే గ్లామర్ కే ఎక్కువగా క్రేజ్ అందుతోంది. లేటెస్ట్ గా ఆమె ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసిన ఫోటో సైతం నెట్టింట్లో వైరల్ గా మారింది. ఈ గ్రీన్ కలర్ లెహంగా-చోళి డ్రెస్ లో ఆమె ఇచ్చిన స్టిల్ సూపర్బ్ అనేలా ఉంది. ఆ లుక్‌లో ప్రియా ప్రకాష్ వారియర్ ఒక విధంగా స్వర్గం నుండి దిగిన దేవతలా కనిపిస్తోందని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. ఆమె ఇచ్చిన పొజెస్ కళ్లను కట్టిపడేస్తున్నాయి. పూర్తిగా కళాత్మకంగా అద్భుతమైన విజువల్స్ తో ఆమె ఫోటో స్టైలింగ్ ప్రత్యేక గుర్తింపుని తెచ్చాయి. ఈ ఫోటోకి కేవలం కొన్ని గంటల్లోనే లక్షలలో లైకులు మరియు వేలల్లో కామెంట్స్ వచ్చాయి. ప్రియా మాత్రమే కాదు, ప్రస్తుతం సోషల్ మీడియా మాధ్యమాలు కూడా ఇలాంటి స్టార్లకు ఎంతో సహాయపడుతున్నాయి. మలయాళ, తెలుగు, హిందీ మరియు ఇతర భాషల్లో సినిమాలు చేస్తూ తన కెరీర్ ను కొనసాగిస్తున్న ప్రియా, ఆ మధ్య 'బ్రో' సినిమాలో పవన్ కళ్యాణ్ మరియు సాయి తేజ్ లతో కలిసి నటించింది. ఆశించినంత గుర్తింపు రాకపోయినా, సోషల్ మీడియా వేదికగా తన గ్లామర్ మరియు ఫ్యాషన్ స్టైల్ తో అభిమానులను అలరిస్తూనే ఉంది. ఫ్యాషన్ స్టేట్‌మెంట్ తో పాటు, ఫోటోషూట్స్ లో కూడా ఆమె తన ప్రత్యేకతను చాటుకుంటోంది



# ఐశ్వర్య తో సీనియర్ హీరో రొమాంటిక్ సాంగ్!

విక్టరీ వెంకటేష్ కథానాయకుడిగా అనీల్ రావిపూడి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఎఫ్-2ఎఫ్-3% తర్వాత ఇద్దరి కాంబినేషన్ లో రూపొందుతున్న చిత్రం కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. ఇందులో వెంకటేష్ కి భార్య పాత్రలో ఐశ్వర్యా రాజేష్ , ప్రియురాలి పాత్రలో మీనాక్షి చౌదరి నటిస్తున్నారు. దీంతో ఇద్దరి భామల మధ్య ముద్దుల ప్రియుడిగా మరోసారి వెంకీ హైలైట్ కాబోతున్నారు. ఫ్యామిలీ స్టోరీలకు హాస్యాన్ని జోడించి తీయడంలో అనీల్ టేకింగ్ తిరుగుండదు. ఆ రకంగా ఇప్పటి వరకూ అతడికి వైఫల్యమే లేదు. ఒకే జానర్ చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద కోట్లు కొల్లగొడుతున్నాడు. ఈసారి వెంకీ ఫ్యామిలీ ఇమేజ్ ని తెలివిగా ఎన్ క్యాష్ చేస్తున్నాడు. తాజాగా ఈ సినిమా అప్ డేట్ అందింది. ప్రస్తుతం పోల్లాచ్చిలో షూటింగ్ జరుగుతుంది. అక్కడ అందమైన లొకేషన్లలో వెంకటేష్-ఐశ్వర్యలపై భార్యభర్తల మధ్య ప్రేమను తెలిపే ఓ పాటని చిత్రీకరిస్తున్నారు. ఈ పాటని భాస్కర భట్ల రచించగా, భీమ్స్ సంగీతం అందిస్తున్నాడు. భాను మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తు న్నాడు. సినిమాలో ఈ పాట ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అంటున్నారు. పాటతో పాటు అక్కడ కొంత టాకీ పార్టు కూడా పూర్తి చేయనున్నట్లుతెలుస్తోంది. అటుపై యూనిట్ హైదరాబాద్ కి తిరుగొస్తుంది. అనం తరం కొన్ని రోజులు విరామం ఇచ్చి మళ్లీ కొత్త షెడ్యూల్ ప్రారంభిస్తారు. నవంబర్ కల్లా షూటింగ్ పూర్తి చేయాలన్నది అనీల్ ప్లాన్. చిత్రీకరణ విషయంలో అనీల్ ప్లానింగ్ ప్రకారం పూర్తి చేస్తాడు. ఎలాంటి డిలే లు ఉండవు. అలాగే బడ్జెట్ కూడా అనుకున్న దాంట్లోనూ ముగిస్తాడు. నిర్మాతలపై అదనపు భారం మోపకుండా చూస్తాడు. ఆ రకంగా నిర్మాత దిల్ రాజు-అనీల్ మధ్య మంచి అండర్ స్టాండింగ్ ఉంది. రాజుగారు ఇష్టపడే దర్శకుల్లో అనీల్ కూడా ఒకరు.



# చిత్రీకరణ దశలో ముఫాసా' : ది లయన్ కింగ్'

## తెలుగు ట్రైలర్‌లో ముసాఫాకు మహేశ్ డబ్బింగ్

ప్రముఖ హాలీవుడ్ నిర్మాణసంస్థ డిస్నీ తెరకెక్కిస్తున్న 'ముఫాసా': ది లయన్ కింగ్' ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. ఆరోన్ స్టోన్, కెల్విన్ హ్యారిసన్ జూనియర్ తదితరులు నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇందులో కీలకమైన ముఫాసా పాత్రకు మహేశ్ బాబు డబ్బింగ్ చెప్పారు. అప్పుడప్పుడు ఈ చల్లని గాలి.. నా ఇంటి నుంచి వచ్చే జ్ఞాపకాలను గుర్తుచేస్తున్నట్టు అనిపిస్తుంది. అంతలోనే అవి మాయమవుతున్నాయని అంటూ మహేశ్ చెప్పే డైలాగ్‌లు ఆకట్టుకునేలా ఉన్నాయి. అద్భుతమైన విజువల్స్‌తో మహేశ్ డైలాగ్స్‌తో ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది.

ఈ మేరకు మహేశ్ ట్వీట్ చేశారు. 'ముఫాసా'కు వాయిస్ ఓవర్ ఇవ్వడంపై మహేశ్ ఆనందం వ్యక్తంచేశారు. మనకు తెలిసిన, ఇష్టపడే పాత్రకు కొత్త అంకం. తెలుగులో 'ముఫాసా'కు వాయిస్‌ని అందించినందుకు చాలా సంతోసంగా ఉంది. ఈ క్లాసిక్‌కి నేను విపరీతమైన అభిమానిని కావడంతో ఇది నాకెంతో ప్రత్యేకంగా ఉంది' అని ట్వీట్‌లో పేర్కొన్నారు. భారీ బ్జడెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఈ సినిమా హిందీ వెర్షన్‌లో ముఫాసా పాత్రకు షారుక్‌ఖాన్ , ముఫాసా చిన్నప్పటి పాత్రకు ఆయన తనయుడు అబ్రం వాయిస్ ఓవర్ అందించారు. ముఫాసాకు అద్భుతమైన వారసత్వం ఉంది. అడవికి అతడే రారాజుగా ఉంటాడు. ఒక తండ్రిగా ఆ పాత్ర నా మనసుకు చేరువైంది. బాల్యం నుంచి రాజుగా ఎదగడం వరకూ ముఫాసా జీవితం ఎలా సాగిందనే విషయాన్నిఈ సినిమా చెబుతుంది. 2019లో వచ్చిన 'ది లయన్ కింగ్' తర్వాత మరోసారి ఈ పాత్ర కోసం వర్క్ చేయడం ప్రత్యేకంగా ఉంది. మరీ ముఖ్యంగా నా పిల్లలతో కలిసి వర్క్ చేయడం ఆనందంగా అనిపిస్తుందని షారుక్ తెలిపారు. ఇందులోని సింబా పాత్రకు షారుక్ పెద్ద తనయుడు ఆర్యన్ ఖాన్ వాయిస్ ఇచ్చారు.







Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613